## టూవీలరా.. గూడ్స్ బండా!?



ప్రమాదమని తెలిసినా కొందరు వాహనదారులు పరిమితికి మించి సామగ్రిని తరలిస్తూ ప్రాణాలమీదికి తెచ్చుకుంటున్నారు. కరీంనగర్ బస్టాండ్ ఎదుట కేవలం ఇద్దరిని మోసుకెళ్లే టూవీలర్‌పై ఓ వ్యక్తి ఇలా నాలుగు భారీ సంచులను తీసుకెళ్తూ తాను ప్రమాదపు ప్రయాణం చేయడమే కాకుండా ఇతర ప్రయాణికులకు వణుకు పుట్టించాడు. తమకు ఆ సంచులు ఎక్కడ తాకి ప్రమాదం బారిన పడతామోనని కొద్దిసేపు భయాందోళన చెందారు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కరీంనగర్

## నిలిచిన బస్సు.. ప్రయాణికుల అవస్థలు

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 18: సిరిసిల్లలోని కొండాలక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద ఆర్టీసీ బస్సు రోడ్డుపైనే మూడు గంటల పాటు నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు. వేములవాడ డిపోకు చెందిన బస్సు ఆదివారం వేములవాడ నుంచి హైదరాబాద్‌కు బయలుదేరింది. సిరిసిల్ల మీదుగా వెళ్తున్న క్రమంలో సాయంత్రం 7.30 గంటల ప్రాంతంలో స్థానిక రేణుక ఎల్లమ్మ జంక్షన్‌లోని కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహం వద్ద సడెన్‌గా నిలిచిపోయింది. దీంతో డ్రైవర్ అధికారులకు సమాచారం అందించగా, దాదాపు మూడు గంటలు గడిచినా ఎలాంటి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టకపోవడంతో ప్రయాణికులు అసహనం వ్యక్తం చేశారు. రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగుతున్న క్రమంలో మరో బస్సును ఏర్పాటుచేసి ప్రయాణికులను పంపించారు.



రోడ్డుపై ఆందోళన చేస్తున్న ప్రయాణికులు

## మహావృక్షరాజం..
# పైడిమడుగు మర్రి



పైడిమడుగు మర్రిచెట్టు

- చరిత్రకు సజీవ సాక్ష్యంగా మర్రిచెట్టు
- కాకతీయుల కాలం నుంచి ఎదిగిన మొక్క
- 800 ఏండ్లకుపైగా వయసు
- నేడు ప్రమాదపుటంచున
- ఐదెకరాల నుంచి ఎకరంన్నరకు తగ్గిన చెట్టు విస్తీర్ణం
- కాపాడాలని కోరుతున్న గ్రామస్తులు

జగిత్యాల, ఫిబ్రవరి 18 (నమస్తే తెలంగాణ) : మొదలు ఏదో.. ఊడలు ఏవో తెలియనంతగా విస్తరించిన మహావృక్షం అది! సూర్య కిరణాలు సైతం భూమికి సోకనంత దట్టంగా పరుచుకున్న చెట్టు అది! ఒక్క ఊడ నుంచి మరో ఊడతో విస్తరిస్తూ.. ఏకంగా ఐదెకరాల స్థలాన్ని ఆవహించిందీ మహావృక్షరాజం కోరుట్ల మండలం పైడిమడుగు మర్రి! ఆ చెట్టు వయసు 800 ఏండ్లకు చేరిందని చెబుతున్నారు వృక్షశాస్త్రవేత్తలు! కాకతీయుల కాలం లో మొక్కగా ప్రస్థానాన్ని ప్రారంభించిన ఈ మర్రి, ఆసియా ఖండంలోనే అతిపెద్ద రెండో వృక్షరాజంగా ఎదిగింది! ఫైకస్ బెంగాలెన్సిస్‌గా చెప్పబడే ఈ చెట్టు, జగిత్యాల జిల్లాలో చారిత్రక ప్రాంతంతో పాటు విహార కేంద్రంగా పేరుగాంచింది. పైడిమడుగుతో పాటు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఈ చెట్టును మర్రవ్వగా పిలుచుకుంటున్నారు. వందల ఏండ్ల చరిత్ర ఉన్న చెట్టు తమ గ్రామంలో ఉందని గర్వంగా చెప్పుకుంటున్నారు. మర్రిచెట్టుకు అమ్మతల్లి మహత్యం ఉన్నదని పైడిమడుగు వాసులు విశ్వసిస్తున్నారు. అందుకే మర్రిచెట్టుకు మరింత పవిత్రత చేకూర్చేందుకు మర్రవ్వ ఆలయం పేరిట, మర్రిచెట్టు మధ్యలో ఆలయం నిర్మించారు. అయితే, కొన్నేండ్ల నుంచి మర్రిచెట్టు ఉనికికి ప్రమాదకరంగా మారిపోయింది. కొన్నాళ్ల క్రితం జరిగిన అగ్నిప్రమాదం వల్ల మర్రిచెట్టులో చాలా భాగం కాలిపోయింది. దీనికి తోడు ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల కొంత చెట్టు ఊడలు, వేర్లు విరిగిపోయి, చెట్టు కూలిపోయింది. చాలా మర్రి ఊడలు భూమిపై ఒరిగిపోయాయి. ఐదెకరాల్లో విస్తరించిన మర్రిచెట్టు, ప్రస్తుతం ఎకరన్నర విస్తీర్ణానికి కుచించుకుపోయింది. ప్రస్తుత ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నిజామాబాద్ ఎంపీగా బాధ్యతలు నిర్వర్తించిన సమయంలో మర్రవ్వ చెట్టు పరిరక్షణ ఆలయ సుందరీకరణ కోసం ₹1.82 కోట్లను తన నిధుల నుంచి మంజూరు చేశారు. అయితే, తర్వాత మర్రిచెట్టు పరిరక్షణను పట్టించుకునేవారు లేకుండా పోయారు. పర్యాటక శాఖ సిబ్బంది సైతం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూనే వచ్చారు. గ్రామం నుంచి విదేశాలకు వెళ్లిన వా ళ్లు, ఎన్ఆర్ఐలు మర్రిచెట్టు పరిరక్షణ కోసం చందాలు వసూలు చేసి మరీ ప్రయత్నం చేస్తున్నారు. కనీసం ఇప్పుడు ఉన్న వృక్షాన్నైనా రక్షించాలని తాపత్రయపడుతున్నారు.



మర్రిచెట్టు వద్ద నిర్మించిన ఆలయం

### పైడిమడుగు మర్రిని కాపాడాలి



చరిత్రకు సజీవ సాక్ష్యం పైడిమడుగు మర్రి చెట్టు. ఫైకస్ బెంగాలెన్సిస్ శాస్త్రీయ నామం తో చెప్పబడే ఈ చెట్టుకు అనేక ప్రత్యేకతలున్నాయి. ఈ చెట్టు కాండంతోపాటు చెట్టుకు పుట్టే ఊడలు సైతం భూమి వైపునకు పెరిగి, భూమిలో కలిసిపోయి కాండంగా పెరిగిపోతాయి. వయసు పెరిగే కొద్ది పెరిగిన ఊడలు కాండాలుగా మారిపోయి చెట్టు విస్తరిస్తూ పోతూనే ఉంటుంది. వాతావరణ కాలు ష్యం, ఇతర ప్రమాదాలు లేని పక్షంలో ఈ వృక్షం వెయ్యి సంవత్సరాలకు పైగా జీవిస్తూనే ఉంటుంది. అయితే, ఇటీవలి కాలంలో ఈ చెట్లు ప్రమాదంలో పడుతున్నాయి. ముఖ్యంగా పట్టణ ప్రాంతాలు, మెట్రోపాలిటన్ పట్టణాల్లో మర్రిచెట్లు దెబ్బతింటున్నాయి. వాతావరణ కాలుష్యంతోపాటు నీటి ఒత్తిడి, ఆకాశ ఆవరణాలు దెబ్బతినడం మూలం గా ఇవి క్రమంగా చనిపోతున్నాయి. పైడిమడుగులో కూడా ఇబ్బందికరమైన పరిస్థితులు ప్రారంభం కావడంతో అది క్రమం గా కుచించుకుపోయే పరిస్థితికి చేరుకుంటుంది. దీన్ని నివారించాల్సిన బాధ్యత అందరిపై ఉన్నది.

- డాక్టర్ పదాల తిరుపతి, వృక్షశాస్త్ర నిపుణుడు

# గులాబీ జెండా ఎగరాలి

- కాంగ్రెస్ మోసాలను ఎండగట్టాలి
- ఆరు గ్యారెంటీలు అమలయ్యేదాకా ప్రజల పక్షాన పోరాడాలి
- పార్టీ శ్రేణులు అధైర్యపడొద్దు.. కడుపులో పెట్టుకుని చూసుకుంటాం
- కరీంనగర్ మాజీ ఎంపీ వినోద్‌కుమార్
- ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల బీఆర్ఎస్ మండలాధ్యక్షులతో సమావేశం



మానకొండూర్: విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్

మానకొండూర్, ఫిబ్రవరి 18: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్ గడ్డపై గులాబీ జెండా ఎగరాలని మాజీ ఎంపీ బీ వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని హుజూరాబాద్, హుస్నాబాద్, మానకొండూర్, చొప్పదండి, కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని బీఆర్ఎస్ మండలాధ్యక్షులతో ఆదివారం మానకొండూర్ మండల కేంద్రంలోని మీనాక్షి కన్వెన్షన్‌హాల్‌లో నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పార్లమెంట్ ఎన్నికలపై నాయకులు దిశానిర్దేశం చేశారు. బీఆర్ఎస్ శ్రేణులు ఎవరూ అధైర్యపడొద్దని, క్యాడర్‌ను కడుపులో పెట్టుకుని చూసుకుంటామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆచరణకు సాధ్యంకాని హామీలు ఇచ్చి అబద్ధాల పునాదులపై అధికారంలోకి వచ్చిందని మండిపడ్డారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని హామి ఇచ్చిందని, గడువు దగ్గర పడుతున్నా ఇప్పటి వరకు ఎందుకు అమలు చేయడంలేదో చెప్పాలని ప్రశ్నించారు. ఆరు గ్యారంటీలు అమలు చేసే దాకా ప్రజల పక్షాన బీఆర్ఎస్ పోరాడుతుందని పేర్కొన్నారు. యాసంగిలో క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిందని ఏప్రిల్, మే మాసాల్లో ఇచ్చిన హామీని ప్రభుత్వం అమలు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

### మేడిగడ్డ ప్రాజెక్టును కాపాడాలి

మేడిగడ్డ బరాజ్‌లో పిల్లర్లు కుంగడాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అనవసర రాద్ధాంతం చేస్తూ బీఆర్ఎస్ సర్కార్‌పై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నదని, వర్షాకాలంలోపే మరమ్మతులు పూర్తిచేసి ప్రాజెక్టును కాపాడాలని మాజీ ఎంపీ వినోద్‌కుమార్ సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. సమావేశం అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడారు. వేసవికి ముందే కరీంనగర్ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలో సాగునీటి, కరెంట్ కష్టాలు వచ్చాయని రైతులు వాపోతున్నారని, ఇలా అయితే మున్ముందు చాలా కష్టమేనన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాళేశ్వరం నీటిని కాలువల ద్వారా గ్రామాల్లోని కుంటలు, చెరువులను నింపి భూగర్భజలాలను పెంచడంతో ధాన్యం ఉత్పత్తులు పెరిగి అన్నదాతలకు సాగునీటి కష్టాలు తప్పాయని గుర్తు చేశారు. దాదాపు పదేళ్ల తెలంగాణలో రైతులకు సాగునీటి, కరెంట్ కష్టాలు లేవన్నారు. ప్రస్తుతం వేసవి కాలం ప్రారంభానికి ముందే రైతులకు సాగు నీటి కష్టాలు వస్తున్నాయంటే అది కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమేనని తేల్చిచెప్పారు. మేడిగడ్డ ప్రాజెక్టు ఎందుకు కుంగిందో..? దానిపై రేవంత్ సర్కార్ విచారణ జరిపించాలని కోరారు. తప్పు ఎక్కడ జరిగిందో గుర్తించాలే కానీ, మేడిగడ్డ బరాజ్ కుంగడాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం భూతద్దంలో పెట్టి చూపించి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తుందని మండిపడ్డారు. వచ్చే వానకాలంలోగా బరాజ్‌కు మరమ్మతులు చేసి తెలంగాణ రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, రాష్ట్ర నాయకులు గడ్డం నాగరాజు, ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల బీఆర్ఎస్ మండలాధ్యక్షులు పాల్గొన్నారు.

# కల్యాణం.. కమనీయం

**కన్నుల పండువగా శ్రీ భూసమేత వేంకటేశ్వర, లక్ష్మీనారాయణుల వివాహ వేడుక**



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కరీంనగర్ జిల్లా కేంద్రంలోని మార్కెట్ రోడ్డులో గల వేంకటేశ్వరస్వామి సప్తమ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీదేవీ, భూదేవీ సమేత వేంకటేశ్వర స్వామి, శ్రీలక్ష్మీనారాయణస్వామి కల్యాణం కమనీయంగా సాగింది. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి వివాహ వేడుకను తిలకించి పరవశించిపోయారు. రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్-మంజుల దంపతులు, కుటుంబ సభ్యులు స్వామి వారికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. ఆలయ ఈవో వుడుతల వెంకన్న, ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు చకిలం శ్రీనివాస్, చకిలం గంగాధర్ శ్రీదేవి, భూదేవి, లక్ష్మీ అమ్మవార్ల తరపున కన్యాదాతలుగా వ్యవహరించగా, అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ దంపతులు ప్రత్యేకంగా హాజరయ్యారు. తిరుమల నుంచి తెప్పించిన 15 వేల లడ్డూలను భక్తులందరికీ అందజేసి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా సల్వాజి ప్రవీణ్ ఆధ్వర్యంలో అన్నమాచార్య సంకీర్తనలు, సాయంత్రం సంగీత కచేరీలు, నృత్యపదన్యనలు ఆకట్టుకున్నాయి.

-కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 18



నృత్యం చేస్తున్న మంత్రి పొన్నం దంపతులు



కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

# మేడారానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

- *కరీంనగర్ బస్టాండ్ కేంద్రంలో కౌంటర్లు*
- *జాతర బస్సును ప్రారంభించిన ఆర్ఎం సుచరిత*
- *మహాలక్ష్మి స్కీం నేపథ్యంలో రద్దీ పెరిగే అవకాశం*
- *నిరంతరం పర్యవేక్షిస్తున్న అధికారులు*



జాతర బస్సును జెండా ఊపి ప్రారంభిస్తున్న ఆర్ఎం

తెలంగాణచౌక్, ఫిబ్రవరి18: తెలంగాణ కుంభమేళా మేడారం సమ్మక్క జాతరకు ఆర్టీసీ ప్లాన్ సిద్ధం చేసింది. ఈ నెల 18 నుంచి 25 దాకా జాతర జరుగనుండగా ఎక్కడా ఇబ్బందులు రాకుండా ప్రత్యేక బస్సులు నడుపుతున్నది. ఈ మేరకు కరీంనగర్ రీజియన్ నుంచి 850 బస్సులను రెడీ చేయగా, ఆదివారం జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లు, జాతర బస్సును ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సుచరిత ప్రారంభించారు. జాతరకు రీజియన్ నుంచి 425 బస్సులతో పాటు మరో 425 బస్సులను ఇతర జిల్లా నుంచి తీసుకొచ్చారు. కరీంనగర్ నుంచి మేడారం దాకా నడిపిస్తున్న ప్రత్యేక బస్సులో పెద్దలకు రూ.280, పిల్లలకు రూ.210 టికెట్ నిర్ణయించగా, ప్రతి 10 నిమిషాలకు ఒక బస్సు బయలుదేరనున్నది. కాగా, భక్తుల సౌకర్యార్థం బస్టాండ్‌లో చలువపందిళ్లు వేశారు. మంచినీటి వసతి, మరుగుదొడ్లు, విశాంత్రి గదులతోపాటు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో వైద్య శిబిరం కూడా ఏర్పాటు చేశారు. జిల్లా నుంచి కాకుండా ఇతర జిల్లాల సిబ్బందిని జిల్లా కేంద్రంతో పాటు మేడారం కరీంనగర్ రీజియన్‌లో క్యాంపులో విధులు కట్టబెట్టారు. కాగా, మహాలక్ష్మి స్కీం నేపథ్యంలో మహిళలు అధికంగా వెళ్లే అవకాశం ఉండడంతో ముందు జాగ్రత్తగా మహిళా పోలీసులు బందోబస్తు విధులు నిర్వర్తిస్తున్నారు.

### అన్ని ఏర్పాట్లు చేశాం

మేడారం సమ్మక్క జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. భక్తులకు ఎక్కడా అసౌకర్యాలు కలుగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశాం. రద్దీ బట్టి అదనంగా మరిన్ని బస్సులు నడిపిస్తాం. ఎవరికీ ఎక్కడా ఇబ్బందులు రాకుండా డీఎంల నుంచి ఉన్నతాధికారుల దాకా పర్యవేక్షణ ఉంటుంది.

- ఆర్ఎం సుచరిత

## రేపు కరీంనగర్‌లో ఉద్యోగ మేళా

హౌసింగ్‌బోర్డుకాలనీ, ఫిబ్రవరి 18 : హైదరాబాద్ అపోలో హోమ్ హెల్త్ కేర్‌లో నర్స్ ఉద్యోగాలు కల్పించేందుకు ఈ నెల 20న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరీంనగర్ జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయంలో ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనా అధికారి కే దేవేందర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీహెచ్‌డబ్ల్యూ, ఏఎన్ ఎం, జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసి ఉండాలని, వయస్సు 18 నుంచి 35 సంవత్సరాల వరకు ఉండాలని పేర్కొన్నారు. వీరికి వేతనం రూ.9,000 నుంచి రూ.39,000 వరకు ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో కరీంనగర్ జిల్లా ఎప్లాయిమెంట్ ఆఫీస్‌లో హాజరు కావాలని, వివరాలకు 91541 37551, 99082 30384, 72076 59969 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

# ఈకేవైసీ ఉంటేనే 'కిసాన్ సమ్మాన్'

- తప్పులు సరిచేసుకునేందుకు అధికారులను సంప్రదించాలి
- మొబైల్ ఫోన్లలోనూ రైతులు సరిచేసుకునే అవకాశం
- కరీంనగర్ జిల్లా వ్యవసాయ అధికారి ప్రియదర్శిని




కరీంనగర్, ఫిబ్రవరి 18 (నమస్తే తెలంగాణ) : ఇక నుంచి ఈకేవైసీ ఉంటేనే ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి వర్తించనున్నది. లేని రైతులకు ఈ పథకం కింద లబ్ధి చేకూరదని, వెంటనే ఈ ప్రక్రియ చేపట్టాలని కరీంనగర్ జిల్లా వ్యవసాయ అధికారి ప్రియదర్శిని ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఈ పథకంలో లబ్ధిదారులైన రైతులు తమ స్టేటస్ తెలుసుకునేందుకు (https://pmkisan.gov.in) ఫార్మర్ కార్నర్‌లో తెలుసుకోవచ్చు. ఈకేవేసీ లేనట్లయితే వెంటనే చేయించుకోవాలి. ఇది ఉంటేనే వచ్చే విడుత కింద ఎకరాకు రూ.2 వేల చొప్పున జమవుతాయని డీఏవో తెలిపారు. ఇప్పటికే ఈకేవైసీ పూర్తి చేసుకుని ఉంటే ఎలాంటి ఇబ్బందీ ఉండదు. ఒక వేళ చేసుకోని రైతులు తమ మొబైల్ ఫోన్‌లో క్రోమ్ బ్రౌజర్‌లో పీఎం కిసాన్ వెబ్‌సైట్‌కు వెళ్లాలి. (https://pmkisan.gov.in లాగిన్ అయితే, అక్కడ ఈకేవైసీ అనే ఆప్షన్ ఉంటుంది. దీని ద్వారా రైతులు ఈ ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చు. ఆధార్ రిజిస్టర్ మొబైల్ నంబర్ కచ్చితంగా రైతుల వద్ద ఉండాలి. అప్పుడే ఆన్‌లైన్‌లో ఓటీపీ నంబర్లు నమోదు చేసి ఈ పని పూర్తి చేసుకోవచ్చు. ఒక వేళ మొబైల్ నంబర్‌తో ఆధార్ లింక్ కాకుంటే బయోమెట్రిక్ లేదా ఫేస్ ఆప్ ద్వారా కూడా చేసుకోవచ్చు. ఇందుకు సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారిని గానీ, మండల వ్యవసాయ అధికారినిగానీ సంప్రదించాలని డీఏవో సూచించారు. ఈ పథకం కింద ఎవరైనా రైతులు సెల్ఫ్ రిజిస్ట్రేషన్ కామన్ సర్వీస్ సెంటర్ల ద్వారాగానీ, లేదా స్వయంగా గానీ నమోదు చేసుకున్న తర్వాత వారి ఖాతాల్లో ఇంకా డబ్బులు జమకానట్లయితే పట్టాదారు పాసు పుస్తకం, బ్యాంక్ ఖాతా పుస్తకం, ఆధార్, రేషన్ కార్డు జిరాక్స్ వివరాలతో సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారిని గానీ, మండల వ్యవసాయ అధికారిని గానీ సంప్రదించాలని ఆమె కోరారు. ఫార్మర్స్ కార్నర్‌ల ఆధార్ వెరిఫికేషన్ స్టేటస్ పెండింగ్ అని చూపించినట్లయితే వెంటనే www.pmkisan.gov.in లో లాగిన్నై ఎడిట్ ఆధార్ ఫెయిల్యూర్ రికార్డ్స్ ఆప్షన్ ద్వారా సరిచేసుకోవాలని, ఆ తర్వాతనే పథకం కింద నగదు రైతుల ఖాతాలో జమవుతుందని తెలిపారు. అలాగే, బ్యాంక్ వివరాలు తప్పుగా నమోదు కావడం, ఇతర కారణాల వల్ల డీబీటీ ఫెయిల్/పీఎఫ్ఎంఎస్ రిజెక్షన్ అని వచ్చిన వెంటనే బ్యాంక్ ఖాతా పుస్తకం, ఆధార్ కాపీతో వెంటనే బ్యాంక్ అధికారులను సంప్రదించి ఆధార్ సీడింగ్, ఎన్‌పీసీఐ మ్యాపింగ్ చేయించుకోవాలని సూచించారు. ఇందు కోసం 2019 ఫిబ్రవరి 1 నాటికి రైతులు పట్టాదారులై ఉండాలని, కుటుంబంలో ఒక్కరు మాత్రమే లబ్ధిదారులై ఉండాలని, మైనర్ కొడుకు, కూతురు పేర్లను వేరువేరుగా నమోదు చేయకూడదని, ఇన్‌కంటాక్స్ చెల్లిస్తున్న వారు, ప్రొఫెషనల్స్, ఉద్యోగస్తులు మొదలైన వారికి ఈ పథకం వర్తించదనే విషయాన్ని రైతులు గమనించాలని స్పష్టం చేశారు.

## ఎంసీహెచ్‌లో శిశువు మాయం

విద్యానగర్, ఫిబ్రవరి 18: కరీంనగర్ దవాఖానలోని మాతాశిశు కేంద్రంలో వలస కార్మిక కుటుంబానికి చెందిన మూడు రోజుల శిశువు మాయమైంది. నగర శివారులోని బావుపేటలో నివసిస్తున్న బిహార్‌కు చెందిన ఓ మహిళకు ఎంసీహెచ్‌సీలో ప్రసవం చేయగా బాబు జన్మించాడు. ఆదివారం ఐసీయూలో ఉన్న బాలింత వద్ద తన అన్న కొడుకును ఉంచి, ఆమె భర్త భోజనం తీసుకువచ్చేందుకు ఇంటికెళ్లాడు. ఈ సమయంలో మూడు రోజుల పసికందును బాలుడు ఎత్తుకొని వచ్చి, ఎంసీహెచ్ ప్రవేశ ద్వారం వద్ద ఓ మహిళకు అప్పగించాడు. ఆ మహిళ దవాఖాన ఆవరణలో అటూ ఇటూ తిరిగి ఓ ఆటోలో కొంత సేపు నిరీక్షించి అందులోనే వెళ్లిపోయినట్లుగా సీసీ పుటేజ్‌లో రికార్డు అయ్యింది. ఆ బాలుడు వట్టి చేతులతోనే దవాఖాన లోపలకు వెళ్లాడు. పసికందు అదృశ్యమైన విషయం చాలా సేపటి తరువాత సిబ్బంది గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. కరీంనగర్ టౌన్ ఏసీపీ నరేందర్‌తో పాటు పోలీస్ అధికారులు ఎంసీహెచ్ చేరుకొని విచారణ చేపట్టారు. సీసీ పుటేజీని పరిశీలించిన పోలీస్ అధికారులు పసికందును చూసుకునేందుకు ఉన్న బాలుడే తీసుకెళ్లి ఓ మహిళకు అప్పగించినట్లుగా గుర్తించారు. అయితే బాలింత మాత్రం ఆ పిల్లవాడికి ఏమీ తెలియదని, ఎవరితో అయినా వెళ్లిపోతుంటాడని చెబుతున్నది. అయితే, ఆ బాలునికి మూడు రోజుల పసికందును చూసుకోమని అప్పగించి ఎలా వెళ్లిపోయాడన్నది అంతుచిక్కడం లేదులేదు. ఈ ఘటనపై పోలీసులు ఆరా తీస్తున్నారు. శిశువు తండ్రితో పాటు బాలుడిని స్టేషన్‌కు తరలించి విచారించారు.



సీసీ కెమెరా ఫుటేజీ